క్లుప్తంగా

ఏపీ ఐడీసీఎల్ అభివృద్ధికి కృషి చేస్తా



భవానీపురం(విజయవాడపశ్చిమ):ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఐడీసీ) లిమిటెడ్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీలరాజ్‌కుమార్ పదవీ కాలాన్ని పొడిగించిన సందర్భంగా సంస్థ డైరెక్టర్లు ఆమెను అభినందించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆమె చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పలువురు డైరెక్టర్లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఐడీసీఎల్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల రాజ్‌కుమార్ మాట్లాడుతూ పదవీ కాలం పూర్తయినప్పటికీ తనపై నమ్మకం ఉంచి పొడిగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సదా రుణపడి ఉంటానని అన్నారు. అలాగే తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్):పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్వచ్ఛ సర్వేక్షణ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ బాబూశ్రీనివాస్ పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద శుక్రవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తెలిపారు. సొసైటీ కోశాధికారి గుర్రం ఏడుకొండలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.రామకృష్ణ ప్రసాద్ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, ఉపాధ్యక్షుడు రాము, ఎస్‌కే షఫీ నాగ మల్లిక, హేమంత రావు, కోటేశ్వరరావు, బత్తిన సీతారామయ్య. తదితరులు పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఈ నెల 26న విజయవాడలో నిర్వహించనున్న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.కనక లింగేశ్వరరావు కోరారు. అజిత్‌సింగ్‌నగర్ సబ్ స్టేషన్ వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి. అనిల్ కుమార్, సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు ట్రాన్స్‌కో కార్మికులు పి. శ్రీకాంత్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



సత్యనారాయణ(విజయవాడసెంట్రల్):విద్యార్థుల భవిష్యత్తుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణ తెలిపారు. సత్యనారాయణపురంలోని శృంగేరిపీఠంలో బలరామకృష్ణమూర్తి దంపతుల చేతుల మీదుగా ఇంజినీరంగ్ చదువుతున్న విద్యార్థినికి శుక్రవారం రూ. 40,647 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినికి చేయూత అందించే ఉద్దేశంతో అమెరికాలో నివాసముంటున్న డాక్టర్ కాత్రపాటి సుబ్బరాయశర్మ ఆర్థిక సాయంతో చెక్కును అందజేసినట్లు తెలిపారు. పేదరికంతో ఉన్నత చదువులు చదవులేని విద్యార్థులకు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శృంగేరి శారదాపీఠ ధర్మాధికారి బీవీ చలపతి రావు, బ్రాహ్మణ బిజినెస్ నెట్‌వర్క్ ప్రతినిధి మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):మల్లేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. దుర్గగుడి ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వర రావు, ఎల్.రమాలతో పాటు వైదిక కమిటీ సభ్యులు మల్లేశ్వరాలయానికి చేరుకుని ఆలయ శిఖరం పనుల గురించి కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రానున్న దసరా, కార్తీక మాసం నాటికి స్వామి వారి దర్శనం కలిగేలా ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఆలయ శిఖర పనులు పూర్తి కానున్న నేపథ్యంలో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసే విగ్రహాల తయారీని ఆదివారం వెళ్లి పరిశీలిస్తారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సాగుతున్న జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 59 వ డివిజన్ 244 వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా, అధికారులతో కలిసి అజిత్‌సింగ్‌నగర్‌లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో అన్ని పార్టీలు కొట్టుకుపోతాయని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామ రక్ష అన్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీసిన ఆయన.. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైల్వే ట్రాక్ వెంబడి చెత్త, పిచ్చి మొక్కలు తొలగించి.. గ్రీనరీని పెంచాలని ఆదేశించారు. పర్యటనలో పలువురు లబ్ధిదారులు తమ ఆనందాన్ని ప్రజాప్రతినిధులతో పంచుకున్నారు. ముఖ్యమంత్రి అందించిన సాయంతో తమ కుటుంబానికి జీవనోపాధి లభించిందని కనకం కృష్ణవేణి వెల్లడించారు. జగనన్న లేకుంటే తమ కుటుంబం పరిస్థితి దయనీయంగా ఉండేదన్నారు. తమకు అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటామని చెప్పారు.

పవన్ పతనం ప్రారంభమైంది....

ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్ల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన రోజు నుంచే రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ పతనం మొదలైందని మల్లాది విష్ణు అన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల పేరు వింటేనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు వెన్నులో వణుకు వస్తోందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, బీజేపీ పెద్దల సపోర్టు చూసుకుని.. ప్రజాబలం ఉన్న ముఖ్యమంత్రిపై బురద చల్లాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. సీఎం జగన్‌ను ఎదుర్కొని నిలబడటానికి పవన్ కాదు కదా మూడు పార్టీల కెపాసిటీ కూడా సరిపోదని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు ఎవరితో కలిసి వచ్చినా 175 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ రామకోటేశ్వర రావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారురాలికి ధ్రువీకరణ పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): అర్హత కలిగి ప్రభుత్వ పథకాలు అందని నిరుపేదలకు జగనన్న సురక్ష ఓ వరమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ శాంతినగర్లో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి వెంకట్రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. సురక్ష శిబిరాల్లో వివిధ శాఖలు జారీ చేసే 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి యూజర్ చార్జీలు లేకుండా అక్కడికక్కడే అందిస్తున్నట్లు వెల్లడించారు. డివిజన్లో 827 మందికి కుల, 928 మందికి ఆదాయ, 7గురికి బియ్యం కార్డులతో పాటు వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 2,176 సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. పాయకాపురం చెరువు పార్కును రూ.3.71 కోట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది ప్రారంభించుకున్నట్లు వెల్లడించారు. దేవినేని గాంధీపురం వాసులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించి, 150 గజాల లోపు ఇళ్లకు త్వరలో రెగ్యులరైజ్డ్ పట్టాలు అందజేస్తామని తెలియజేశారు. పీఓయూసీడీ శకుంతల తహసీల్దార్ మాధురి, అసిస్టెంటు కమిషనర్ -2 అనసూయ, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. 60వ డివిజన్ వాంబే కాలనీలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. 751 సర్టిఫికెట్లు క్యాంపు ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. డివిజన్లో 2,037 సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.26.36 లక్షల వ్యయంతో పవర్ బోర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. రూ.2.50 కోట్ల నిధులతో నూతన బస్టాండ్‌ను నిర్మించబోతున్నట్లు తెలియజేశారు. పార్టీ డివిజన్ కోఆర్డినేటర్ బెవర నారాయణ, డివిజన్ అధ్యక్షుడు బత్తుల దుర్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

220 మందికి ఉచిత వైద్య పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ నూరే పవన్‌కుమార్, డాక్టర్ మానస

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్, మానస హాస్పటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం భవానీపురం ఐరన్ కాంప్లెక్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీర్ణకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ నూరె పవన్‌కుమార్, మానసిక వ్యాధుల నిపుణులు డాక్టర్ ఆర్‌కే అయోధ్య, చైల్డ్ అండ్ అడల్ట్స్ సైకియాట్రిస్ట్ డాక్టర్ మానస కాజలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నూరె పవన్‌కుమార్ మాట్లాడుతూ జీర్ణకోశ వ్యాధులను అశ్రద్ధ చేయకుండా తగు వైద్యం పొందుతూ, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రస్తుతం ఆహారపు అలవాట్లు జీవనశైలిలో ఎక్కువ మంది జీర్ణకోశవ్యాధుల భారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. మానసిక ఒత్తిళ్లు, వ్యాధులపై డాక్టర్ ఆర్కే అయోధ్య అవగాహన కలిగించారు. మానసిక రుగ్మతలను సత్వరమే గుర్తించి వైద్యం పొందాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్య సమస్యలను వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి కొనకళ్ల సూర్యశంకర్‌లు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

నోరీ ఆసుపత్రిలో 40 రోజుల పాపకు అరుదైన చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు గురవయప్ప

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని నోరీ ఆసుపత్రిలో 40 రోజుల పాపకు వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన రాజేష్, అలేఖ్య దంపతులకు 40 రోజుల పాప. కామెర్ల వ్యాధితో బాధ పడుతుండడంతో నోరి ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి పిత్తాశయం పగిలిందని గుర్తించారు. వెంటనే పాపకు కోలిసిస్టెక్టమి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. పూర్తి ఆరోగ్యంతో ఉన్న పాపను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ నోరి సూర్యనారాయణ, డాక్టర్ గురవయప్ప, డాక్టర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సమస్య పసిపిల్లలో చాలా అరుదని పేర్కొన్నారు. త్వరితగతిన వ్యాధిని నిర్ధారించి సకాలంలో ఆపరేషన్ చేశామన్నారు. ఎటువంటి ప్రాణాపాయం లేకుండా పాపను కాపాడగలిగామని వివరించారు. తమ పాప ప్రాణాలను కాపాడిన నోరి అసుపత్రి వైద్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆగస్టు7న తిరుపతిలో ఓబీసీ 8వ జాతీయ మహాసభలు



ఓబీసీ జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆల్‌మెన్ రాజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓబీసీ 8వ జాతీయ మహాసభలు ఆగస్టు 7న తిరుపతిలోని తారక రామ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కె.ఆల్‌మెన్ రాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీ మహాసభ వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆల్‌మెన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభలకు ప్రభుత్వంలోని ప్రముఖులు హాజరవుతారన్నారు. చేతి వృత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాటికొండ రంగబాబు మాట్లాడుతూ 'మా వృత్తి.... మా వాటా ..మేమెంతో... మాకంత' అనే నినాదంతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు దేవు రవి,రాజు, రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు చిప్పాడ చందు, కడలి ప్రసాద్, కార్పెంటర్స్ అసోసియేషన్ గన్నవరపు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై శుక్రవారం విజయవాడకు చెందిన సీహెచ్ దీపాన్విత బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రాజగోపురం ఎదుట కళావేదికపై దీపాన్విత బృందంలోని సాత్విక, ఉజ్వలసాయి, హాసిని, సింధూజ, నిందిత, జ్ఞానదీపికలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ జీఎస్ రాజు ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8.00 గంటల నుంచి 10.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీరు బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్ రాజు రోడ్డు, ఒరుగు వారి వీధి, దాట్ల బ్రహ్మరాజు వీధి, దేవాలయం వీధి, సుబ్బరాజు వీధి, బెజ్జం వారి వీధి, శివాలయం , గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగర పాలకసంస్థ పాఠశాల, పశుసంవర్థక శాఖ కార్యాలయం, ప్రభుత్వ ముద్రణాలయం, అంబేద్కర్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అలానే 11 కేవీ భారతమాత మందిరం ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. శ్రీదేవీ హైట్స్ రోడ్డు, ఉప్పలపాటి సీతారామరాజు వీధి, భారతమాత రోడ్డు, గ్రీన్ స్ట్రీట్, పాండు రంగా అపార్ట్‌మెంట్ రోడ్డు, విఘ్నేష్ అపార్ట్‌మెంట్ రోడ్డు, నందమూరి నగర్ మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫౌండేషన్ సహకారంతో దుర్గాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తామన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పవన్‌కల్యాణ్ పెద్ద రాజకీయ అజ్ఞాని

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మతిభ్రమించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలను ఆసిఫ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వించిపేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ పెద్ద రాజకీయ అజ్ఞాని అని విమర్శించారు. చంద్రబాబుకు ఊడిగం చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రజల మనస్సులను గెలుచుకున్న జగన్‌మోహన్‌రెడ్డిపై నోటికొచ్చినట్లు మాట్లాడటం దుర్మార్గమన్నారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల నిలబడి డిపాజిట్లు కూడా రాని ఆయన దేశంలోనే అత్యధిక మెజార్టీ ఓట్లతో ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలుపొందిన జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యంగా 50 శాతానికి పైగా ఓట్లతో గెలుపొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తరిమికొడతానంటూ పవన్‌కల్యాణ్ మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. మహిళల పట్ల ఏ మాత్రం గౌవరం లేని పవన్‌కల్యాణ్ వలంటీర్లలో 60 శాతానికి పైగా ఉన్న మహిళలను, అందులోనూ అత్యధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలను నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పవన్‌కల్యాణ్‌కు బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

చెత్త సేకరణలో అలసత్వం వద్దు

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



చెత్త సేకరణ పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు):చెత్త సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. సర్కిల్-3 పరిధిలోని 5 వ డివిజన్ క్రీస్తురాజుపురం అమ్మ కళ్యాణ మండపం వద్ద శుక్రవారం ఆయన పర్యటించారు. కొన్నిచోట్ల చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించి , స్థానికంగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు, శానిటరీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారికి ఆయన మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. బిన్ ఫ్రీ సిటీలో భాగంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్నులను తొలగించామని చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను విభజించి కార్మికులకు అందిచేలా స్థానికులకు చైతన్య పరచాలని సూచించారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనుల గురించి చెత్త సేకరణకు శానిటేషన్ సిబ్బంది ప్రతి ఇంటికి వస్తుందీ... లేనిదీ అక్కడి ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర వ్యాప్తంగా ఉన్న అన్ని కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా తీయాలని ఆదేశించారు.

డివిజన్ల అభివృద్ధికి నిరంతర కృషి



స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్ల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మేయర్ అధ్యక్షతన శుక్రవారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. మొత్తం 26 అంశాలు ఎజెండాలో పొందుపరచగా అందులో 20 ఆమోదించగా, మూడు ర్యాటిఫై చేశారు. ఒక అంశాన్ని వాయిదా వేయగా, ఒకటి రికార్డు, మరొక అంశాన్ని ధ్రువపరుస్తూ తీర్మానించారు. స్థాయీ సంఘం సభ్యులతోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలు ఇవే...

- నగరంలోని ప్రధాన కూడళ్లు, ఆయా ప్రాంతాల్లో గ్రీనరీని పెంపొందించేందుకు 2023-24 ఏడాదికి ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా ట్రీగార్డులు, స్టాకింగ్ స్టిక్స్, ఎరువుల కొనుగోలుకు రూ. 25 లక్షలు అంచనాలు రూపొందించారు. వాటిని వీఎంసీ సాధారణ నిధుల నుంచి వినియోగించుకునేందుకు ప్రతిపాదన రాగా సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- సర్కిల్-1 పరిధిలోని 54వ డివిజన్‌లోని వించిపేట ఇఫెన్‌స్టీట్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు రూ. 43.78 లక్షల నిధులు ఖర్చుకు వచ్చిన ప్రతిపాదనను స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు.
- సర్కిల్-3 పరిధిలోని 3వ డివిజన్‌లో గణేష్‌నగర్ కాలనీలో 8, 8ఏ, 11 అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ. 39.50 లక్షల నిధులు వెచ్చించేందుకు వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- వీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ డివిజన్-2లో 2021 ఫిబ్రవరి 1 తేదీ నుంచి ఈ ఏడాది మే 31వ తేదీ వరకు 54 పనులు అత్యవసరంగా నామినేషన్ పద్ధతిలో పనుల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులకు వచ్చిన ప్రతిపాదను కమిటీ సభ్యులు వాయిదా వేశారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



దావు బుచ్చయ్యకాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్):వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి తెలిపారు. బుచ్చయ్యకాలనీలో రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు పూర్తిచేయాలని సూచించారు. డివిజన్‌లో రూ. 9 కోట్ల వ్యయంతో రోడ్లు వేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ సుబ్బారెడ్డి, దుర్గారావు, రామకృష్ణ, కృష్ణారెడ్డి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అర్జా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ప్రదర్శన



లెనిన్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. లెనిన్ సెంటర్‌లో శుక్రవారం మహిళా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో మణిపూర్ ఘటనకు నిరసనగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గా భవాని మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేదన్నారు. గత రెండు నెలలకు పైగా దాడులతో ఘటనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. రెండు జాతుల మధ్య జరుగుతోన్న ఘర్షణలతో మణిపూర్ రగిలిపోతోందన్నారు. హింసాత్మక ఘటనలు, లూటీలు, దాడులతో మణిపూర్ భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. దాడుల్లో 140 మందికిపై ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. హింసాత్మక ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వ చర్యలు చేపట్టక పోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని తొలగించాలని, నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి గంగాభవాని మాట్లాడుతూ మణిపూర్ ఘటనలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించే దాకా మోడీ వాస్తవ పరిస్థితులను బయటకు తీసుకొచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ మహిళా వ్యతిరేకి అని విమర్శించారు. ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, పీఓడబ్ల్యూ, ఐద్వా, పీడీఎస్‌యూ, ఎఐవైఎఫ్, ఇఫ్టూ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధురంగా శాస్త్రీయ సంగీత కచేరీలు



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ షష్టి పూర్తి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే సంగీత మహోత్సవాలు లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు, వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, స్వాతి తిరునాళ్, అన్నమయ్య, రామదాసు, రచించి స్వరపరచిన కీర్తనలు ఆలపించారు. టి.రుక్మిణీ కృష్ణ తిరుచ్చినాపల్లి, రాగమయూరి, లోళ్ళ జయరాం, విశ్వనాథ్, నీరజ, హరిప్రియ, తేజస్వి సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి మాట్లాడారు. వేమూరి విశ్వనాథ్, భమిడిపాటి శ్రీలలిత పాల్గొన్నారు.